ప్రజాశక్తి
ఆదివారం 13, నవంబర్ 2022 5 అనంతపురం



నిమోనియా వ్యాధి నివారణపై అవగాహన

అనంతపురం : బాల్యం ప్రశాంతంగా ఊపిరి తీసుకోవాలంటే నిమోనియా లక్షణాలను వెంటనే గుర్తించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా.యుగంధర్ తెలిపారు. శనివారం నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిమోనియా వ్యాధి నివారణకు నేటి నుంచి వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీ వరకూ జిల్లావ్యాప్తంగా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించడంతోపాటు మందులు అందజేయనున్నట్లు తెలిపారు. నిమోనియా వ్యాధి ఐదేళ్లలోపు పిల్లల మరణాలకు అతిముఖ్యమైన కారణం అన్నారు. దగ్గు, జలుబు ఎక్కువగా ఉండటం, ఎక్కువసార్లు వేగంగా శ్వాస తీసుకోవడం, ఛాతీ లోపలికి పోవడం, అధిక జ్వరం ఉండడం, శ్వాస తీసుకునే సమయంలో గురకరావడం, నీరసంగా, మత్తుగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఒడి డాక్టర్ సుహాసిని, డాక్టర్ పుష్పలత, సుబ్రహ్మణ్యం, హెచ్ఇ శామ్యూల్, త్యాగరాజు, ఎంపిహెచ్ఒలు పాల్గొన్నారు.

పత్తి పంట..మూగజీవాలకు మేత..

ఎన్నో ఆశలు.. ఎంతోకొంత ఆదాయం వస్తుందన్న నమ్మకం.. చేతిలో చిల్లిగవ్వ లేకున్నా అప్పులు చేసి పత్తి పంటపై పెట్టుబడులు పెట్టిన రైతన్నల ఆశలు అడియాశలుగా మారాయి. విత్తు నాటాక అది మొలకెత్తి ఏపుగా ఎదిగిన పంటను చూసి రైతులు ఎంతో మురిసిపోయారు. అతివృష్టి ప్రభావంతో ఈ పంటలు పచ్చగా ఎదిగాయే తప్ప పత్తి కాయ.. పిందె కూడా కనిపించలేదు. కొంత ఆలస్యంగా అయినా పిందె, పూత లాంటివి వస్తాయేమో అని ఎదురుచూసినా మొగ్గ పూసింది కూడా లేదు.. రైతుల ఆశలు వికసించిందీ లేదు.

నాలుగు మాసాలైనా రాని దిగుబడి
ఈ సారీ నష్టాల ఊబిలో రైతులు
ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పెద్దవడుగూరు మండలం రైతులు పచ్చగా ఉంటున్న పత్తి పంటలను చూసి దిగుబడులు వస్తాయని నాలుగు మాసాలుగా ఎదురుచూశారు. కాపు లేకపోవడంతో దిగుబడులు ఇక రావని నిర్ధారించుకున్నారు. ఎప్పటిలాగే ప్రకృతి తమను మోసం చేసిందని ఆందోళన చెందారు. ఖరీఫ్‌లో వేరుశనగ, పప్పుశెనగ పంటల నష్టంతో పాటు పత్తి పంట కూడా తీవ్ర నష్టానికి గురిచేసిందని తెలుసుకుని రైతులు కలత చెందారు. ఇక చేసేదేమీ లేక పంటలను తొలగించుకుని మూగజీవాలకు మేతగా వదిలిపెడుతున్నారు. పెద్దవడుగూరు మండలంలోని లక్ష్మంపల్లి, దిమ్మగుడి, చిన్నవడుగూరు ఆవులాంపల్లి, కాశేపల్లి, కొట్టాలపల్లితో పాటు పలు గ్రామాల్లో రైతుల దుస్థితి ఇది. ఆరుగాలం కష్టించి పనిచేసినా ఏడాదికి ఎంతో కొంత మూటగట్టుకోవచ్చునని భావించినా సాగుచేసిన పంటలు ప్రకృతి ప్రకోపానికి గురైపోయి తీరని నష్టాలను మిగుల్చుతున్నాయి. మండల వ్యాప్తంగా 35 వేల హెక్టార్లలో పత్తి పంటను రైతులు సాగుచేయగా చాలా గ్రామాల్లో వర్షాలు అధికమై పూత, పిందె రాలిపోవడం.. కాపుదశ లేక దిగుబడులపై ఆశలు సన్నగిల్లాయి. దీనికితోడు గులాబీరంగు పురుగుతో కూడా రైతులు పత్తిపంటను తీవ్రంగా నష్టం పోవాల్సి వచ్చింది.

ఇక ప్రత్యామ్నాయమే శరణ్యం..

ఈ పరిస్థితులలో రైతులు చేసేదేమీలేక పచ్చని పంటలను పశువులకు వదిలివేశారు. వాటిని





లక్షుంపల్లి గ్రామంలో పత్తి పంటను మూగజీవాలకు మేతగా వదిలివేసిన రైతులు

తొలగించుకుని ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారిస్తున్నారు. ప్రస్తుతం హెచ్ఎల్‌సి కాలువకు సాగునీరు వస్తున్నందున నీటి తడులు అందించి పంటలు పండించుకోవాలనే తపనతో రైతులు ఉన్నారు. ఏది ఏమైనా ఇలా వరుసగా పంటలకు పెట్టుబడులు పెడుతూ నష్టపోతూ బతుకు ఈడ్వడం రైతులకు నానాటికీ కష్టంగా మారుతోంది. రైతు కుటుంబాలు జీవచ్ఛవాలుగా మారుతున్నాయి. నష్టపోయిన పత్తి, మిరప పంటలకు ప్రభుత్వం పరిహారం వర్తింపజేసి రైతులను ఆదుకోవాలని సిపిఎం, రైతు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

మూగజీవాలకు మేతగా వదిలేశాం..

మూడు ఎకరాల్లో పత్తి పంట సాగుచేశాను. ఎకరాకు రూ.30 వేలు చొప్పున రూ.90 వేలు పెట్టుబడి పెట్టాను. పంట అయితే ఏపుగా పచ్చగా పెరిగింది. నాలుగు నెలలవుతున్నా పూత, పిందెలు కూడా రాలేదు. చేసేదేమీ లేక పంటను మూగజీవాలకు మేతగా వదిలేశాం. ప్రత్యామ్నాయ పంట వేసుకోవాలి.

- జయరామిరెడ్డి, రైతు, లక్షుంపల్లి గ్రామం



కాలనీల్లో పర్యటిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సిపిఎం నాయకులు

నడిమివంక బ్రిడ్జిని పూర్తి చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజలకు అసౌకర్యంగా ఉన్న రుద్రంపేట నడిమీవంక బ్రిడ్జిని సత్వరమే పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. సిపిఎం నగర న్యూ కమిటీ రెండో రోజు శనివారం చేపట్టిన పాదయాత్ర రుద్రంపేట నడిమీవంక బ్రిడ్జి దగ్గర ప్రారంభమై చంద్రబాబు కాలనీ, పంతులు కాలనీ, ఆర్‌వైఎఫ్ కాలనీ, సైపుల్లా కాలనీ మీదుగా చైతన్య కాలనీలో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 38 అడుగులు ఉన్న నడిమి వంకను కొందరు రాజకీయ నాయకులు ఆక్రమించడం వల్ల పది అడుగులకు చేరుకుందన్నారు. కావున ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నడిమి వంక ఆక్రమణలను అరికట్టి వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వరదల వల్ల నష్టపోయిన కుటుంబాలకు రూ.2వేలు నష్టపరిహారం చెల్లించి అధికారులు, ప్రజాప్రతినిధులు చేతులు దులుపుకున్నారన్నారు. అదికూడా చైతన్యకాలనీలో దాదాపు 63 కుటుంబాలకు, అలాగే పంతులు కాలనీ, సైపుల్లా కాలనీ వంక వెంబడి ఉన్న కుటుంబాలకు ఇవ్వలేదన్నారు. వెంటనే నష్టపరిహారం చెల్లించకపోతే ఈనెల 14న ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర్ న్యూ కమిటీ కార్యదర్శి ఆర్‌వి నాయుడు, సిపిఎం నగర న్యూ కమిటీ కార్యవర్గ సభ్యులు గోపాల్, ఇర్ఫాన్ కమిటీ సభ్యులు ఓబులేసు,మనోహర, సురేంద్ర, లక్ష్మీనారాయణ, రామంజినమ్మ, లతీఫ్ ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఆజాం, ఆది, గఫోర్ సిఐటియు నగర అధ్యక్షులు గురాజు,గౌస్, కెవిపిఎస్ నాయకులు అక్కులప్ప ఐద్వా నాయకురాలు అరుణమ్మ ప్రజానాట్యమండలి నాయకురాలు కృష్ణవేణి, ప్రజాశక్తి నగర్ శాఖ కార్యదర్శి సీనా, పెరుగు గోపాలు, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిఐటియు, ఎఐటియుసి నాయకులు

విశాఖ ఉక్కును ప్రయివేటీకరించొద్దు

రాష్ట్ర ప్రయోజనాలను మోడీకి తాకట్టు పెట్టొద్దు
సిఐటియు, ఎఐటియుసి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రుల హక్కుగా ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వమే నిర్వహించాలని, ప్రయివేటీకరించడానికి వీలులేదని సిఐటియు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్.నాగేంద్రకుమార్, రాజారెడ్డిలు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో నగరంలోని జిల్లా పరిషత్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న మోడీ గో బ్యాక్, రాష్ట్రంలోకి అడుగు పెట్టొద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అదానీ, అంబానీలకు ఊడిగం చేస్తూ దేశ సంపదను దోచిపెడుతోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేటీకరిస్తోందని విమర్శించారు. రాష్ట్ర విభజన అంశాలు ఏ ఒక్కటీ అమలు చేయకుండా రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం ద్రోహం చేస్తోందన్నారు. ప్రజలను దగా చేయడానికి మరోసారి మోడీ రాష్ట్రంలో పర్యటించారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ముఖ్య మంత్రి వైస్.జగన్‌మోహన్‌రెడ్డి మోడీకి మోకరిల్లుతూ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టేశాడని విమర్శించారు. రెండు రోజులుగా అక్రమ అరెస్టులు చేస్తూ ప్రశ్నించే గొంతుకలను అడ్డుకోవడం సిగ్గుచేటు అన్నారు. 25 మంది ఎంపీలను ఇస్తే ప్రత్యేక హోదా సాధిస్తామని గొప్పలు చెప్పిన జగన్ నేడు 23 మంది ఎంపీలు ఉన్నా కేంద్రంతో పోరాడలేని దుస్థితిలో ఉండటం దురదృష్టకరం అన్నారు. రైల్వే, ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, విమానం, ఓడరేవులను ప్రయివేటీకరించిన మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను కూడా ప్రయివేటీకరించడానికి కుట్రలు చేస్తోందన్నారు. దీన్ని సహించేది లేదన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముర్తుజా, ప్రకాష్, ఆవాజ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు మసూద్ వలి, బాబు, డివైఎఫ్ఐ నరసింహారెడ్డి, ఎస్ఎఫ్ఐ విజయ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగభూషణం, లక్ష్మినారాయణ, ఎఐటియుసి అధ్యక్షులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు జి.ఓబులు

జీతాలు అడిగితే అక్రమ అరెస్టులు చేస్తారా..?

సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు జి.ఓబులు

ప్రజాశక్తి-ఉరవకొండ

చేసిన పనులకు జీతాలు ఇవ్వాలని స్యసాయి తాగునీటి పథకం కార్మికులు అడిగితే అక్రమంగా అరెస్టు చేయిస్తారా.. అంటూ సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు జి.ఓబులు ప్రశ్నించారు. శనివారం ఉరవకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రాట్యూటీ, బకాయి వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్, గుర్తింపు కార్డులు ఇవ్వాలనే డిమాండ్లతో 16 రోజులుగా పామిడి పంప్‌హౌస్ వద్ద సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు, సిపిఎం నాయకులు శాంతియుతంగా సమ్మె చేస్తుంటే పోలీసులు అక్కడికి వెళ్లి అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. రక్షణ కల్పించాల్సిన పోలీసు వ్యవస్థ అధికార పార్టీ నాయకుల కనుసన్నుల్లో పని చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. 572 మంది కార్మికులతో పనులు చేయించుకుని వారికి రావాల్సిన గ్రాట్యూటీ ఇవ్వకుండా కుటుంబాలను ఇబ్బందులకు గురిచేసి బజారుకీడ్చడం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. కార్మికుల కష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అధికారులే వారికి కొమ్ము కాస్తూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా కార్మికులు సమ్మె, ధర్నాలు చేయకుండా ముందస్తు అరెస్టులు చేయడం ఈ ప్రభుత్వానికి అలవాటుగా మారిందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను ఉధృతం చేసి జైలుకెళ్లడానికైనా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణాల్లో ఉపాధి పనులు కల్పించాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి-గుత్తి

ఉపాధి హామీ పథకం పనులను పట్టణాల్లో కూడా కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శనివారం పట్టణ శివారులోని జెడ్ వీరారెడ్డి కాలనీలో వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు చేతినిండా పని కల్పించి, పనికి తగ్గ కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు చట్టాన్ని అమలు చేసి జోన్ల వారీగా కూలి రేట్ల వివరాలు సచివాలయంలో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సాగు భూమి లేని వ్యవసాయ కార్మికులకు 8వ విడత భూ పంపిణీలో ప్రతి కుటుంబానికీ ఐదెకరాల సాగుభూమి ఇవ్వాలన్నారు. ఉపాధి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి ప్రతి జాబు కార్డుకూ 200 రోజులు పనులు కల్పించాలన్నారు రోజు కూలి రూ.600 ఇవ్వాలన్నారు. అనంతరం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా మద్దిలేటి, కార్యదర్శిగా ఎస్. మున్ని, సహాయ కార్యదర్శిగా రంజిత్ నాయక్, రేణుక ఉపాధ్యక్షులుగా బావమ్మ, రామచంద్ర, నారాయణమ్మ, కోశాధికారిగా మల్లికతోపాటు మరో పది మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకురాలు వి.నిర్మల, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, మహిళా సంఘం నాయకురాలు కవిత వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రంజిత్ నాయక్, మద్దిలేటి, రామచంద్ర, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి

రాజీమార్గమే..రాజమార్గం..

న్యాయమూర్తులు సుబహాన్, విజయకుమార్

ప్రజాశక్తి--కళ్యాణదుర్గం

కక్షిదారులు, ప్రజలు రాజీమార్గంలో అలవర్చుకుంటే మీ కుటుంబాలు, పిల్లలకు అన్నివిధాలా మేలు జరుగుతుందని న్యాయమూర్తులు సుబహాన్, విజయకుమర్ సూచించారు. శనివారం బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ప్రాంగణంలో మెగా లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నచిన్న పొరపాట్లు, క్షణికావేషాలు, మనస్పర్థలకు గురై కేసులు దాకా వచ్చి కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకోవడం పొరపాటన్నారు. కావున కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోకుండా పెద్దల సమక్షంలో రాజీమార్గాన్ని అలవార్చుకోవాలని సూచించారు. తప్పులను తెలుసుకునే లోగా సమయం కాస్తా చేజారిపోయిన తర్వాత ఎవరూ ఏమీ చేయలేరన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కరణం తిప్పేస్వామి, దేవేంద్ర, క్రిష్ణమూర్తి, పట్టాభి, హరి, వాల్మీకి ప్రియాంక, పట్టణ సీఐ తేజోమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

రాష్ట్ర ద్రోహి ప్రధాని మోడీ..

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రధాని మోడీ ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ద్రోహిగా మిగిలిపోయారని వామపక్ష పార్టీల నాయకులు విమర్శించారు. ప్రధాని మోడీ రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు శనివారం పట్టణంలోని పొట్టి శ్రీరాములు సర్కిల్ వద్ద 'నరేంద్ర మోడీ గో బ్యాక్' అంటూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ బి.సురేష్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి మాట్లాడుతూ తిరుపతి వెంకన్న సాక్షిగా రాష్ట్రానికి ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రత్యేక హోదా, వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, కడపలో ఉక్కు పరిశ్రమ, కర్నూల్‌లో రైల్వేవ్యాగన్ తయారీ పరిశ్రమ, అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీ, ఎయిమ్స్ ఆసుపత్రి, నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన వంటి హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేసిన పాపానపోలేదన్నారు. కావున మోడీకి రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు డి.శ్రీనివాసులు, నాయకులు మారుతీప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు రామాంజనేయులు, రంగస్వామి, సిపిఐ నాయకులు రాముురాయల్, వెంకట్‌నాయక్, మురళీకృష్ణ, కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

వ్యవసాయాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి-పుట్లూరు

రోజురోజుకూ సంక్షోభంలో కూరుకుపోతున్న వ్యవసాయాన్ని కాపాడుకుందాని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని కడవకల్లు బిసి కాలనీలో ఉన్న రైతుసంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ రంగం రోజురోజుకూ మరింత క్షీణిస్తోందన్నారు. స్వామినాథన్ కమిషన్ సూచనల మేరకు మద్దతు ధర చట్టం తెస్తామని హామీ ఇచ్చి ఇప్పటిదాకా ఆ చట్టం తీసుకురాలేదన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని అధికారంలోకి వచ్చిన పాలకులు గాలికి వదిలేశారన్నారు. అలాగే విద్యుత్ సవరణ బిల్లు 2022 ద్వారా కేంద్ర ప్రభుత్వం ఒత్తిడితో రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ రంగంలో మీటర్లు పెట్టేందుకు సన్నాహాలు చేయడం బాధాకరమన్నారు. ఈసమయంలో వ్యవసాయాన్ని కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. 'రైతులను రక్షించుకుందాం, వ్యవసాయాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో ఈనెల 16, 17, 18వ తేదీల్లో కడపలో రాష్ట్రస్థాయి రైతు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 16న కడప జిల్లా పరిషత్ హాల్‌లో నిర్వహించనున్న సెమినార్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.టి.రామాంజినేయులు, రైతుసంఘం మండల కార్యదర్శి గుత్తా వెంకటచౌదరి, వెంకటశేఖర, బాల గురయ్య, పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న పివికెకె డిప్లొమా కళాశాల చైర్మన్ పల్లె కిషోర్

పివికెకె డిప్లొమా కళాశాలలో ఫ్రెషర్స్ డే

అనంతపురం : స్థానిక ఆలమూరు రోడ్డులోని పివికెకె డిప్లమా కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల వ్యవస్థాపకులు, మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, చైర్మన్ పల్లె కిషోర్, ప్రిన్సిపల్ సుజాత హాజరై మాట్లాడుతూ ప్రపంచంలో సాంకేతిక విజ్ఞానవంతుల్లో తెలుగు వారే ఎక్కువ ఉన్నారన్నారు. అలాగే విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్లొమా ప్రిన్సిపల్ వైభవ్, డీన్ సంతోష్ కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి కార్మికుల అరెస్టు అన్యాయం

అనంతపురం కలెక్టరేట్ : శ్రీసత్యసాయి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులకు గ్రాట్యూటీ, బకాయి వేతనాలు ఇవ్వమని కోరుతుంటే ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా పోలీసులతో అక్రమ అరెస్టులకు పాల్పడటం సరికాదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. అరెస్టులతో నోళ్లు మూయించాలనుకోవడం సరికాదని, తక్షణమే సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేనిక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

కనకదాస జయంతి వేడుకలు

కళ్యాణదుర్గం : మండల పరిధిలోని తిమ్మసముద్రం పంచాయతీ మంగళకుంట గ్రామంలో భక్తకనకదాస జయంతి వేడుకలను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలోని కుల పెద్దల ఆధ్వర్యంలో మహిళలు, చిన్నపిల్లలు బోనాలు సమర్పించి కనకదాస విగ్రహాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మహిళలు చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని బొమ్మకుపల్లి రాజరాజేశ్వరి ఆలయంలో శనివారం స్వకులశాలి సమాజం చేనేత కమిటీ ఆధ్వర్యంలో ధాత్రి హోమం నిర్వహించారు. ఇందులో భాగంగా రుత్వికులు, వేద మంత్రోచ్ఛారణలతో హోమం చేశారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పనుల పరిశీలన

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని 35వ డివిజన్ పరిధిలో రూ.18 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సిమెంట్ రోడ్ పనులను మేయర్ మహమ్మద్ వసీం శనివారం పరిశీలించారు. పనులు వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని ప్రధాన రోడ్ల తోపాటు అంతర్గత రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సైపుల్లా బేగ్, బాబా ఫక్రుద్దీన్, నాయకులు ప్రకాష్‌రెడ్డి, డిఇఇ రాంప్రసాద్‌రెడ్డితోపాటు పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

పార్టీల్లో జగడాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలకు సమయం ముందుకొస్తుండటంతో పార్టీల్లో జగడాలు పెరుగుతున్నాయి. ముందస్తు రాకపోతే 2024లో సార్వత్రికలు ఎన్నికలు రానున్నాయి. అంటే మధ్యలో 2023 సంవత్సరం మాత్రమే అడ్డుగా ఉంది. ఇక ఏడాది మాత్రమే ఉండటంతో అప్పుడే పార్టీల్లో హడావుడి మొదలవుతోంది. ముందుగా ఇంట గెలిచేందుకు నేతలు సన్నద్ధమవుతున్నాయి. దీంతో ప్రధాన పార్టీల్లో అంతర్గత పోరులు సైతం మొదలవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో రాజకీయ కదలికలు ఊపందుకుంటున్నాయి. ఈ వారంలో అధికార వైసిపిలోనూ, అటు ప్రతిపక్ష టిడిపిలోనూ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. జిల్లా అధ్యక్షులుగా కాపు రామచంద్రారెడ్డి పదవి నుంచి తప్పుకుంటున్న పార్టీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డికి రాజీనామా లేఖను అందజేశారు. అధికారపార్టీలో నాయకుల మధ్య సమన్వయ సమస్యలు ఉన్నా అంత తారాస్థాయిలో ఏమీ లేవు. ఎవరి నియోజకవర్గం పరిధిలో వారు పనిచేసుకుంటూ వెళు న్నారు. ఇలాంటి సమయంలో ఏ సమస్య వచ్చిందో తెలియదుకాని వైసిపి జిల్లా అధ్యక్ష పదవి నుంచి కాపు రాచంద్రారెడ్డి స్వచ్ఛందంగా తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. కుటుంబ సమస్యలతోనే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు చెబుతున్నా ఇతర కారణాలేమైనా ఉన్నాయా అన్న సందేహాలు రాజకీయవర్గాల్లో మాత్రం చర్చ జరుగుతోంది. ఇక ఈ పదవిని ఎవరికి ఇస్తారన్న దానిపై వైసిపి చర్చ జరుగుతోంది. మాజీ ఎమ్మెల్యే బి.గురునాథరెడ్డి, తలారి రంగయ్య, ఫయాజ్ బాషా తదితర పేర్లు ప్రముఖంగానే వినిపిస్తున్నాయి. అయితే అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందన్నది చూడాల్సి ఉంది. హిందూపురం పార్లమెంటు సభ్యులు గోరంట్ల మాధవ్ మరో వివాదంలో పడ్డారు. ఇంటికి అద్దె చెల్లించకుండా ఉన్నారంటూ ఇంటి యాజమాని నిరసనకు దిగడం అధికారపార్టీలో మరో చర్చనీయాంశంగా మారింది. అశ్లీల విడియోల అంశం ఇటీవలనే సద్దుమణిగిన సమయం ఇది తెరపైకి రావడం రాజకీయవర్గాల్లో ఆయన తీరు చర్చనీయాంశంగా మారింది. ఇక ప్రతిపక్ష టిడిపిలోనూ ఈ వారంలో కళ్యాణదుర్గం నియోజకవర్గం అంశం తెరపైకి వచ్చింది. నియోజకవర్గం పరిధిలో మండల అధ్యక్షుల ఎంపిక సమావేశం జరిగింది. మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి సమక్షంలో జరిగిన ఈ సమవేశంలో నేతలు బాహాబాహీకి దిగడం పెద్ద చర్చనీయాంశమూ అవుతోంది. 2019 నుంచి మొదలైన అధిపత్యపు పోరు రోజురోజుకు పెరుగుతూపోతూనే ఉంది. దీన్ని సమన్వయం చేయడం నాయకులకు సాధ్యపడని అంశంగా మారింది. ఇలా రాజకీయాల్లో ఎన్నికల వేడి మొదలైనట్టుగా కనిపిస్తోంది. ఇక ఈ వారంలో మరో ప్రధాన అంశంగా ఉన్నది సోమందేపల్లి మండలంలోని కావేటినాగసముద్రంకు సంబంధించి ఒక రైతు పొలాన్ని నాసిన్ సంస్థకు బలవంతంగా తీసుకోవడం. ఆయన పొలాన్ని, నివాసాన్ని బలవంతంగా స్వాధీనం చేసుకోవడం ఉన్నఫలంగా వారినీ బజారుకీడ్చటం అనేక విమర్శలకు తావిస్తోంది. వీరికి మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం, యాదవ సంఘం నిరసనలో పాల్గొంటున్నారు. దీన్ని పోలీసుల చేత అణచివేసే చర్యలను అధికారులు చేపడుతున్నారు.



మహాసభలను జయప్రదం చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కృష్ణమూర్తి, సూరి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

వజ్రకరూరు మండలంలో ఈనెల 21, 22వ తేదీల్లో నిర్వహించనున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కృష్ణమూర్తి, సూరి పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం తాడిపత్రి రూరల్ పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీలో నాయీ బ్రాహ్మణ కమిటీ హాల్ పక్కన ఉన్న రామాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 1934లో నెల్లూరు జిల్లా అలగానిపాడులో అమరజీవి, మహానేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. అప్పటి నుంచి నేటి వరకూ శాఖోపశాఖలుగా విస్తరించి దేశంలో కోటికిపైగా సభ్యత్వం కలిగి అతి పెద్ద సంఘంగా ఎదిగిందన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పార్వతి, కార్యదర్శిగా రామంజనమ్మ, సహాయ కార్యదర్శులుగా జయమ్మను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం పుట్లూరు మండల అధ్యక్షులు పెద్దయ్య, తాడిపత్రి నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-తాడిపత్రి

పట్టణంలోని గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు ఎల్ఎం ఉమా మోహన్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను స్థానిక గ్రంథాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు సమాజ అభివృద్ధిలో అంతర్భాగమన్నారు. అన్ని తరగతుల వాళ్ల గ్రంథాలయాలను ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలని కోరారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బి.రవికుమార్‌నాయుడు, గ్రంథాలయ అధికారులు వి.వీరనారాయణరెడ్డి, ఎస్.జయరాములు, గ్రామీణ గ్రంథాలయాధికారి దేవదాసు గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.



వారోత్సవాల గోడపత్రికలను విడుదల చేస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ ఉమా మోహన్‌రెడ్డి, గ్రంథాలయ అధికారులు

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయం

కొట్టాలపల్లి ప్రభుత్వ వైద్యాధికారి హరనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయంగా ప్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం చేపట్టినట్లు కొట్టాలపల్లి ప్రభుత్వ వైద్యాధికారి హరినాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం విడపనకల్ మండల పరిధిలోని పొలికి గ్రామంలో ప్యామిలి ఫిజిషన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా దాదాపు 30 మందికి వైద్యపరీక్షలు చేశారు. వీరిలో ఐదుగురు గర్భిణులకు రక్తపరీక్షలు నిర్వహించి ఐరన్ మాత్రలు, టానిక్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమం ద్వారా ఆయా గ్రామాలకు వెళ్లి ఉదయం సాధారణ వ్యాధులకు, మధ్యాహ్నం ఆరోగ్య ఆసరా కింద నడవలేని స్థితిలో మంచానికి పరిమితమైన వ్యాధిగ్రస్థులందరికీ వైద్యం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మకుమారి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పి మహిమ, 104 సిబ్బంది విజయ్, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్యాధికారి హరనాథ్‌రెడ్డి

జగనన్న కాలనీల్లో జనం ఇక్కట్లు

జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టీసీ వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జనం ఇక్కట్లు పడుతున్నారని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ విమర్శించారు. 'జగనన్న ఇళ్లు-పేదలందరికీ కన్నీళ్లు' కార్యక్రమంలో భాగంగా శనివారం అనంతపురం రూరల్ లోని కొడిమి గ్రామంలో ఉన్న జగనన్న కాలనీలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం టిడ్కో ఇళ్లు పూర్తయి మూడున్నర సంవత్సరాలు పూర్తయినా లబ్ధిదారులకు అప్పగించలేదన్నారు. నివాసాలకు ఏమాత్రం ఉపయోగం లేని ఇళ్ల స్థలాలు ఇచ్చి జగనన్న కాలనీల అంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాన్ని క్షేత్రస్థాయిలో ఎండగట్టేందుకే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యక్రమాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవానీ రవికుమార్, నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు, నగర కమిటీ సభ్యులు, వీరమహిళలు, నాయకులు పాల్గొన్నారు. అలాగే ఉరవకొండలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గౌతమ్‌కుమార్, కూడేరు, బెలుగుప్ప మండలాల అధ్యక్షులు నాగేష్, కాసంశెట్టి సుధీర్, నాయకులు దేవేంద్ర, రాజేష్, అబ్దుల్, మల్లికార్జున, మల్లేష్‌గౌడ్, సురేష్, రమేష్, ప్రశాంత్, రామాంజి, మధు, తిప్పయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే నార్పలలో ఉన్న జగనన్న కాలనీలో పర్యటించి ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ నాయకులు కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్, తుపాకుల భాస్కర్, ప్రదీప్, రామయ్య, గిరీష్, కళ్యాణ్, నాగేష్, విజయ్, బాబా, రాము తదితరులు పాల్గొన్నారు. అలాగే శింగనమల మండలం కల్లుమడి, తరిమెల జగనన్న కాలనీల్లో జనసేన నాయకులు పర్యటించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి బొమ్మన పురుషోత్తంరెడ్డి, మండలం కన్వీనర్ తోట ఓబులేసు, బిందెల సాయి శంకర్, శేషు, రాము, తదితరులు పాల్గొన్నారు



అనంతపురం రూరల్ మండలం కొడిమిలో ఉన్న జగనన్న కాలనీలో నిరసన తెలుపుతున్న జనసేన పార్టీ నాయకులు

'సత్యసాయి' కార్మికులకు లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వండి

కలెక్టర్‌కు సిఐటియు నాయకుల లేఖ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీసత్యసాయి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులకు గ్రాట్యుటీ డబ్బులు, ఇఎస్ఐ, పిఎఫ్ డబ్బులు ఎప్పుడు చెల్లిస్తారో లిఖిత పూర్వకంగా హామి ఇచ్చి కార్మికుల సమ్మెను విరమింపజేయాలని సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు డిమాండ్ చేశారు. శనివారం సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మొబైల్ ద్వారా లేఖ పంపారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ గతంలో కార్మికులు సమస్యల పరిష్కారానికి సమ్మె చేసినప్పుడు అధికారులు నోటి మాటగా హామీ ఇచ్చి సమ్మె విరమింపజేశారని, అయితే సమస్యలు పరిష్కరించకుండానే బదిలీ అయిపోయారన్నారు. శ్రీసత్యసాయి తాగునీటి బోర్డు ఛైర్‌పర్సన్‌గా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఉన్నారని, కావున లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చి సమ్మె విరమింపచేయాలని కోరారు. 750 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తూ 572 మంది కార్మికులు పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రెండు నెలల వేతనాలు బకాయిలు ఉన్నాయని, ఇఎస్ఐ, పిఎఫ్, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. గ్రాట్యూటీ ఎప్పుడు చెల్లిస్తారో ఖచ్చితమైన తేదీ వెల్లడించాలన్నారు. ఇప్పోటికే 19 మంది కార్మికులు మృతి చెందారని, మరి కొంతమంది పదవీ విరమణ చెందారని తెలిపారు. వారందరికీ గ్రాట్యూటీ సొమ్ము చెల్లించాలని కోరారు.

తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గడ్డంనాగేపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు ఏర్పాటు చేశారు. రెండు వారాలుగా తీవ్రమైన తాగునీటి సమస్య ఏర్పడటంతో సర్పంచు నాగన్న ఎంపిపి దృష్టికి తీసుకెళ్లడంతో శనివారం నిధులు విడుదల కావడంతో బోరు వేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుని బోరు వేసేందుకు నిధులు మంజూరు చేసినందుకు ఎంపిపికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శివారెడ్డి, జగన్ యాదవ్, పంచాయతీ సెక్రటరీ లక్ష్మి, హర్ష ఇంజినీర్ శ్రీకాంత్ స్థానికులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

నేతాజీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రకాష్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మన ఇంటితో పాటు మన చుట్టు ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని పర్యావరాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నేతాజీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి.ప్రకాష్ అన్నారు. విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నేతాజీ స్కూల్‌లో నెలవారీ పోటీల్లో భాగంగా విద్యార్థులకు డ్రాయింగ్, పర్యావరణాంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే భవిష్యత్తు అంధకారం అవుతుందని సూచించారు. వివిధ పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఏజి.రాజ్‌మోహన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పర్యావరణ స్థితిగతులను మరింతగా తెలుసుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వం విజ్ఞాన కేంద్రం కో కన్వీనర్ పి.శ్రీ నివాసరావు, కార్యదర్శులు ఎంఎన్‌టి.రాజు, విరూపాక్ష, ఎల్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

నేరాలు ఘోరాలు

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

18 వాహనాలు స్వాధీనం

అనంతపురం : ద్విచక్ర వాహనాల దొంగను త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేసి 18 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. త్రీటౌన్ సిఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన సమాచారం మేరకు కడప జిల్లా లక్కిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుప్పం మల్లికార్జున తాగుడు వ్యసనాలకు బానిసయ్యాడు. దీంతో నకిలీ తాళాలతో ద్విచక్ర వాహనాలను దొంగతనం చేయడం అలవాటుగా మారింది. ఈనేపథ్యంలో అనంతపురం, చిత్తూరు, కడప, జమ్మలమడుగు, పులివెందుల, పొద్దుటూరు, కర్నూలు తదితర ప్రాంతాల్లో బస్టాండుల్లో ఉంచిన ద్విచక్ర వాహనాలను దొంగలించాడు. ఈవిధంగా దొంగలించిన వాహనాలను ఒక అపార్టుమెంట్ వెనుకాల దాచిపెట్టగా గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడి నుంచి రూ.14.50 లక్షల విలువైన 18 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రంగడు, వలిబాషా, ఎఎస్ఐ లోక్‌నాథ్‌చౌదరి, హెడ్ కానిస్టేబుళ్లు శివయ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రంగనాథ స్వామి ఆలయంలో పూజలు

గుత్తి : కార్తీకమాసం మూడవ శనివారాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో దేవాదాయ శాఖ జిల్లా అధికారి ఎం.రామాంజినేయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం నిర్మించిన స్నానపు గదులు, తాగునీటి కొళాయిలు, వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. ఆలయం చుట్టూ ఉన్న స్థలాన్ని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బొలికొండ రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వేల్పుల సోమశేఖర యాదవ్, కార్యనిర్వాహణాధికారి వి. దేవదాస్, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

గుత్తి : పట్టణంలోని ఫుట్‌బాల్ మైదానం వద్ద ఉన్న ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం కార్యాలయంలో శనివారం ఉచిత కీళ్ల మార్పిడి వైద్య శిబిరం నిర్వహించారు. కర్నూలు చెందిన గౌరీ గోపాల్ ఆసుపత్రి వైద్య నిపుణులు విఎస్.ప్రసాద్ దాదాపు వందమంది రోగులను పరిశీలించి మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షులు కె. అబూబకర్, కార్యదర్శి రామ్మోహన్, అదనపు కార్యదర్శి జెనే కుళ్లాయిబాబు, ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి పల్లకిసేవ

ఉరవకొండ : మండలంలోని పెన్నహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం సాయంత్రం ఘనంగా పల్లకిసేవ నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో అధిష్టించి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో విజయ్ కుమార్, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు 'మెట్టు' ఆర్థికసాయం



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న మెట్టు గోవిందరెడ్డి

బొమ్మనహాల్ : మండలంలో ఇటీవల చోటు చేసుకున్న విద్యుత్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి ఒక్కో కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం కుటుంబాల సభ్యులను పరామర్శించి భరోసా కల్పించారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కొందరికి ఇళ్లు నిర్మించి ఇస్తామని, వారి పిల్లలను ఉచితంగా చదివిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కో ఆపరేటివ్ సభ్యుడు బాషా, వైసిపి నాయకులు ముల్లంగి నారాయణస్వామి, మాజీ ఎంపిపి లాలుసాబ్, ఉంతకల్లు ఖాసీంవలి, బల్లలగుడ్డం, కళ్లహోళ, గోవిందవాడ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ మృతికి నివాళి

అనంతపురం కార్పొరేషన్ : నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం పరిధిలోని ఎలక్ట్రికల్ విభాగంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న రాఘవేంద్ర అనారోగ్యంతో శనివారం మృతిచెందడంతో మేయర్ వసీం నివాళులర్పించారు. ఇందులో భాగంగా మృతుని నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించి అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు. మేయర్ వెంట కార్పొరేటర్లు శ్రీనివాసులు, సైపుల్లా బేగ్, మల్లికార్జున, బాబా ఫకద్దీన్, తదితరులు ఉన్నారు.

అనాథాశ్రమానికి విరాళం

గుత్తి : పట్టణంలోని కొత్తూరులోని స్వీట్ సేవియర్స్ ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన వృద్ధ, అనాథాశ్రమానికి న్యూ సిపిఐ కాలనీకి చెందిన విశ్రాంత ట్రాన్స్ కో ఉద్యోగి జి.గోపాల్ కుటుంబసభ్యులు శనివారం రూ.12 వేలు ఆర్థికసాయం చేశారు. జి.గోపాల్ ఐదు నెలల క్రితం మరణించారు. ఆయన జ్ఞాపకార్థం భార్య రంగమ్మ, కుటుంబ సభ్యులు జి. హరికష్ణ, సునీల్, అరవింద్, లికిత, శ్రీయాన్స్, సి.రాజు,టి. రాజు, నరసింహులు వెంకటస్వామి ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

పుట్లూరు : రాష్ట్రంలోని విద్యావ్యవస్థలో సిఎం జగనన్న విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. శనివారం మండలంలోని నాయకునిపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరికీ విద్య అందించడమే లక్ష్యంగా రాష్టట ప్రభుత్వం పని చేస్తోందన్నారు. 2020-21కి రాష్ట్రాల పని తీరుపై కేంద్రం విడుదల చేసిన గ్రేడింగ్‌లో కేరళతో సమానంగా ఎపి నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంపిపి భూమిరెడ్డి రాఘవరెడ్డి, నాగార్జునరెడ్డి, సర్పంచులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో ఉండాలి

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

సచివాలయ ఉద్యోగులు వచ్చామా.. వెళ్లామా.. అన్నట్లు కాకుండా వాలంటీర్లతోపాటు క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. శనివారం నగరంలోని 9, 10వ డివిజన్లలో కార్పొరేటర్లు వై.లక్ష్మిదేవి, ఎం.దేవితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మూడేళ్లుగా కలిగిన లబ్ధిని వివరించారు. ఇందులో భాగంగా స్థానిక సీపీఐ నాయకులు తాగునీరు, డ్రెయినేజీ, పైప్‌లైన్ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెలఏయ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ డ్రెయినేజీ సమస్యలకు సంబంధించి శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా వినాయకనగర్‌లో రూ.20 లక్షలతో పనులు చేపట్టామని, మరికొన్ని నిధులు వెచ్చించి డ్రెయినేజీ డైవర్షన్ చేపట్టి పెద్ద కాలువలోకి కలిసేలా చర్యలు తీసుకుంటామన్నారు. దరఖాస్తు చేసుకోకున్నా కొందరికి విద్యుత్ మీటర్లు మంజూరైన విషయాన్ని స్థానికులు తెలియజేయగా ఆ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. రోడ్లు, డ్రెయినేజీల వివరాలు సిబ్బంది వద్ద లేకపోవడంతో ఎమ్మెల్యే అనంత అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయం పరిధిలో ఎంత మేరకు రోడ్లు ఉన్నాయి? డ్రెయినేజీల పరిస్థితి ఏంటి? ఎక్కడెక్కడ మరమ్మతు చేయాలి? ఎక్కడ కొత్తవి వేయాలి? అనే సమాచారం లేకపోతే ఎలాగని ప్రశ్నించారు. తక్షణం ఆ వివరాలు రెడీ చేయాలని ఆదేశించారు. గడప గడపకూ మన ప్రభుత్వం సందర్భంగా వస్తున్న ప్రతి సమస్యనూ పరిష్కరించాలన్నారు. అలాగే రేషన్ సక్రమంగా ఇవ్వడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, పంపిణీ విషయంలో పర్యవేక్షణ ఉంచాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులకు అందాలని తెలిపారు. మూడేళ్లయినా ఇంకా సమస్యలు వస్తుంటే ఎలాగని ప్రశ్నించారు. గత ప్రభుత్వానికి, ఇప్పుడున్న ప్రభుత్వానికి మధ్య తేడా ఏంటో స్పష్టంగా ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ ఎకెఎస్ ఫయాజ్, పలువురు కార్పొరేటర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి